
కథ

# సౌఖ్యలక్ష్మి

డా.టి.కళ్యాణీ సచ్చిదానందం

అది హేమంత ఋతువు. పుష్యమాసం. శరీరాలను గజ గజలాడించే చలిని లెక్కచేయకుండా ప్రజలంతా దశరథ మహారాజు దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు.

ఇక్ష్వాకు వంశ ప్రభువు, ధర్మనిరతుడు, అయోధ్యా నరేశుడైన దశరథ మహారాజు కైకయ రాజపుత్రిక కైకేయిని వివాహం చేసుకుని, దిగ్విజయ యాత్ర ముగించుకుని నగరానికి తిరిగి వచ్చాడు. ఆయన ధర్మపాలనలో దేశంలో శాంతిభద్రతలు సుస్థిరమై, కరువుకాటకాలు లేక ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. శీతాకాలం పంటలు పుష్కలంగా పండి గాదెలు నిండాయి. పల్లె ప్రజలు ఆనందంతో వేడుకలు జరుపుకునే సమయం దగ్గర పడింది. ఈసారి తమ సంబరాలలో పాలుపంచుకోవడానికి చిన్నరాణి సమేతంగా మహారాజును ఆహ్వానించడానికి వచ్చారంతా.



విషయం తెలిసిన దశరథుడు వాళ్లను కలుసుకోవడానికి కైకేయి అంతఃపురం నుండి బయలుదేరుతున్న సమయంలో వచ్చాడు- ఇంద్రసారథి మాతలి దేవరాజు సందేశం, ఆహ్వానం తీసుకుని.

"దశరథ మహారాజా! మీ అవక్రమ విక్రమాలతో భూమిపై సుస్థిర సామ్రాజ్యాన్ని నెలకొల్పి, యజ్ఞయాగాదులతో ఇంద్రుని కూడా ప్రసన్నం చేసుకున్నారు. అందుకే దేవరాజు మిమ్మల్ని సన్మానించడానికి సాదరపూర్వకంగా తీసుకురమ్మని నన్ను పంపారు" అంటూ వినయంగా తెలిపాడు మాతలి.

ఆ సందేశం విన్న కైకేయి ముఖం ప్రఫుల్లమైంది.

"దేవరాజు స్వయంగా ఆహ్వానం పంపడం ఎంతటి గౌరవ సూచకం! వెంటనే బయలుదేరుదాం ప్రభూ! నాకూ ఇంద్రలోకం చూడాలని చాలా ఉత్సాహంగా వుంది!" అన్నది భర్తవైపు అనురాగంతో చూస్తూ.

ఆమె వాలుచూపులు హృదయాన్ని వివశం చేస్తుంటే వెంటనే అంగీకరించాడు దశరథుడు. అప్పుడే అక్కడకు వచ్చిన మంత్రి సుమంతునితో-

"మహామంత్రీ! మేము దేవరాజు ఆహ్వానం మన్నించి స్వర్గధామం అమరావతికి తరలి వెళుతున్నాం కైకేయీదేవి సహితంగా. ప్రజలను చూసి వారి విన్నపాలు వినే వ్యవధి లేదు. మీరు వాళ్లను ఆదర పూర్వకంగా సత్కరించి పంపండి. మేము తిరిగి వచ్చాక మా ప్రజానీకాన్ని దర్శిస్తాము" అంటూ కైకేయికి చేయందించి రథాన్నధిరోహించాడు దశరథుడు.

మహారాజు వెళ్లిన వార్త సుమంతుని ద్వారా విని నిరుత్సాహంతో వెనుదిరిగారు ప్రజలంతా!

☆ ☆ ☆

'ఏమిటీ ప్రకృతి వైపరీత్యం. అయోధ్యలో అనావృష్టి లక్షణాలు కానవస్తున్నాయి. భూమి బీటలు వారి వుంది. చెట్లు, చేమలు ఎండిపోయి దుర్భిక్షం తాండవమాడుతున్నది! ఆ కానవస్తున్నది తన అయోధ్యా నగరమేనా?"

మేఘాల మధ్య సాగుతూ భూమిని సమీపిస్తున్న రథంలో నుండి తమ రాజ్యం వైపు దృష్టిసారించిన దశరథుడు ఆశ్చర్యంగా అనుకున్నాడు.

దేవేంద్రుని స్వాగత సత్కారాలు స్వీకరించి, కొంత కాలం అక్కడ అతిథిగా గడిపి కైకేయితోబాటు తిరిగి తన రాజధాని చేరిన దశరథుడు సస్యశ్యామలంగా వుండే తన రాజ్యంలో దుర్భిక్షం ప్రబలి ప్రజలు ఈతిబాధలతో ఇక్కట్లు పడుతుండటం చూసి తల్లడిల్లిపోయాడు.

"ఏమిటిది సుమంతా! ఎన్నడూ లేనిది మన రాజ్యంలో ఈనాడు ఇలా అనావృష్టి ప్రబలడానికి కారణమేమిటి? మేము లేని సమయంలో యజ్ఞయాగాల నిర్వహణ సరిగా సాగలేదా?" ప్రశ్నించాడు తీవ్రంగా చూస్తూ.

"క్షమించాలి మహాప్రభూ! అవి అన్నీ సజావుగానే సాగుతున్నాయి. కానీ మీరు దేవేంద్రుని ఆహ్వానం అందుకుని వెళ్లాక అయోధ్యలో ఎన్నడూ ఎరగని విధంగా క్షామం వ్యాపించింది. నిండిన గాదెలు ఖాళీ అయిపోయాయి. పంటచేలు, వృక్షజాలం అకారణంగా ఎండిపోయి పశునష్టం, పాడినష్టం సంభవించాయి. ఇందుకు కారణం ఏమిటో తెలియడం లేదు ప్రభూ!" అన్నాడు ఖిన్న వదనంతో సుమంతుడు.

"కారణం నేను వివరిస్తాను మహారాజా! ఇది ధాన్య

లక్ష్మి కోప ప్రభావం" అన్నారు అప్పుడే వచ్చిన వశిష్టమహర్షి.

"ధాన్యలక్ష్మికి కోపం రావడానికి మేము చేసిన అపరాధమేమిటి గురువర్యా?" ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించాడు దశరథుడు.

"మహారాజా! నిదానంగా ఆలోచించండి. మీరు క్షేత్ర యాత్ర నుండి తిరిగి వచ్చిన సమయంలో ప్రజలు పంటలు పుష్కలంగా పండినందుకు కృతజ్ఞతతో తమ గాదెలు నింపిన ధాన్యలక్ష్మిని పూజించి ఉత్సవాలు జరపాలనుకున్నారు మీ అధ్వర్యంలో. కానీ వారి కోరిక మన్నించకుండా మీరు సతీసమేతంగా ఇంద్రుని ఆహ్వానం అందుకుని వెళ్లిపోయారు. ధాన్యలక్ష్మి అది తనకు అవమాన కారణంగా భావించి అదృశ్యమైంది. అందుకు పర్యవసానమే ఈ దుర్భిక్షం. ధాన్యలక్ష్మి కరుణ లేకుండా ప్రకృతి శోభిల్లదు. కరువు, కాటకాలు విలయతాండవం చేస్తాయి" అంటూ వివరించారు వశిష్టమహర్షి.

"అలాగా! నా వల్ల ఎంతటి పొరబాటు జరిగింది. గురువర్యా! ధాన్యలక్ష్మిని తిరిగి ప్రసన్నురాలిని చేసుకునే మార్గం ఉపదేశించండి. నా తప్పిదం మన్నించమని ప్రార్థిస్తాను" అన్నాడు దశరథుడు దీనంగా పశ్చాత్తాప హృదయంతో.

"మీ కుమార్తె శాంతాదేవి భర్త ఋష్యశృంగుని రావించి ధాన్యలక్ష్మికి ప్రీతికరంగా యజ్ఞం నిర్వర్తించండి. ఆ దేవి ప్రసన్నురాలౌతుంది " అంటూ కర్తవ్యం ఉపదేశించారు వశిష్టమహర్షి.

ఆ విధంగా యజ్ఞం నిర్వహించి, తన తప్పిదాన్ని మన్నించమని పరిపరి విధాలుగా ప్రార్థించాడు దశరథుడు ధాన్యలక్ష్మిని. అతని ప్రార్థనలకు ప్రసన్నురాలై అతని ముందు సాక్షాత్కరించింది ధాన్యలక్ష్మి.

పుష్యమాసపు మంచుపొరల మధ్య పచ్చని పట్టువస్త్రాలు ధరించి, నానారత్నాభరణాలతో శోభాయమానంగా వెలుగొందుతూ, చేతులలో చెరుకుగడలు, ధాన్యం నిండిన పాత్ర ధరించి తమ పాలిట కల్పతరువులా దర్శనమిచ్చిన ఆ దేవికి భక్తితో ప్రణమిల్లాడు దశరథుడు.

"యాదేవీ సర్వ భూతేషు మాతృ రూపేణ సంస్థితా!

నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః!!

లక్ష్మీం, క్షీర సముద్రరాజ తనయాం, శ్రీరంగధామేశ్వరీమ్!

దాసీ భూత సమస్త దేవ వనితాం- లోకైక దీపాంకురామ్!!"

అంటూ స్తుతించాడు.

"మాతా! తెలియక నాచేత జరిగిన తప్పును మన్నించి, దుర్భిక్షంతో తల్లడిల్లుతున్న నీ బిడ్డలను కనికరించు. ప్రకృతి స్వరూపిణివైన నీవు కోపిస్తే ఈ సృష్టి సర్వం జడమయం కాదా దేవీ! మమ్మల్ని కరుణించి, నీ కృపావృష్టి కురిపించు" అంటూ మొరపెట్టుకున్నాడు దశరథుడు.

"దశరథ మహారాజా! నీ స్తుతులకు ప్రసన్నురాలినైనాను. ఇకపై నీ రాజ్యంలో కరువుకాటకాలకు తావుండదు. నీ ప్రజల గృహాలన్నిటా ధాన్యలక్ష్మి స్థిర నివాసం ఏర్పరచుకుంటుంది. సరేనా?" అన్నది చిరునవ్వుతో చూస్తూ.

"మహాప్రసాదం మాతా!" అన్నాడు సంతోషంగా దశరథుడు.

"మహారాజా! మీ భాగ్యవశాన ధాన్యలక్ష్మి కటాక్షానికి పాత్రులైనారు. పౌష్యమాసాన ఈ యజ్ఞఫలంగా ప్రాదుర్భవించిన ఆ దేవిని 'పౌష్యలక్ష్మి'గా కీర్తిస్తూ ఉత్సవాలు నిర్వర్తింపచేయండి. ధన, ధాన్య సమృద్ధి కలిగి ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారు!" అంటూ ఉపదేశించారు వసిష్టమహర్షి.

☆☆☆

"శౌనకాది మునులారా! విన్నారుగా పౌష్యలక్ష్మి ప్రాదుర్భావం ఎలా జరిగిందో. ఆమె రాకతో దుర్భిక్షం తొలగి భోగభాగ్యాలు సమకూడటంతో ఆ పర్వదినాన్ని భోగిపండుగగా జరుపుకోసాగారు ప్రజానీకం.

'పట్టు చీరాగట్టి, పట్టు రవికా తొడిగి, పచ్చనాకుల విడెము చేతబట్టి పడతిరో నీకిపుడు సంపదిద్దామని పట్టపగలే ఇంటికొచ్చె పౌష్యలక్ష్మి!'

అంటూ హరిదాసులు కీర్తిస్తూ మేలుకొలుపుతుంటే పల్లెపట్టులు కళకళలాడుతూ ఆ తల్లికి స్వాగతం పలికేవి. పుష్యమాసపు చలిని పారద్రోలడానికన్నట్లుగా అక్కడక్కడ భోగి మంటలేర్పరచే వాళ్లు. గృహాలను పరిశుభ్రంగా ఉంచి, ఇండ్లముందర కళ్లాపి జల్లి రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దే వారు స్త్రీలు. ఆ ముగ్గుల మధ్య గోమయంతో చేసిన గొబ్బిళ్ల నుంచి పసుపు, కుంకుమలు పూలు అర్పించి లక్ష్మీరూపంగా పూజించేవారు. ఇవన్నీ చూసి సంతుష్టురాలైన పౌష్యలక్ష్మి వాళ్లకు సర్వశుభాలూ ప్రసాదించేది" అంటూ ఆగారు సూతమహర్షి.

"ఆహా! ఎంత చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించారు మహర్షి తమరు పౌష్యలక్ష్మి ప్రాదుర్భావం జరిగిన భోగి పర్వదినం వేడుకలను. ఆ పర్వదినానికి మరింత పవిత్రత చేకూర్చింది మహాలక్ష్మి. ఎనిమిది అవతారాలలో ఒకటైన సంతానలక్ష్మి కూడా. ఆ ఉదంతం వివరించండి మీ శిష్య బృందాలకు" అన్నారు భరద్వాజ మునీంద్రులు చిరునవ్వుతో.

"సత్యం వచించారు మునీంద్రా! స్త్రీలకు అనుకూల దాంపత్యం, సత్సంతానం ప్రసాదించే సంతానలక్ష్మి వివాహం శ్రీరంగనాథుడైన మహావిష్ణువుతో జరిగింది ఈ భోగి పర్వదినానే! అమ్మవారి పెళ్లికి అందరూ పెద్దలే గదా! అందుకే పగలు పౌష్యలక్ష్మిని వివిధోపచారాలతో పూజించి, సాయంత్రం వైష్ణవ మందిరాలలో వైభవంగా జరుపబడే సంతానలక్ష్మి వివాహం చూడటానికి ఉత్సాహంగా తరలివెళతారు జనానీకం.

మహాలక్ష్మి కుమార్తె కావాలన్న కోరికతో విష్ణుచిత్తుడనే బ్రాహ్మణునిగా జన్మిస్తాడు గరుత్మంతుడు ద్రవిడ దేశంలో. అతనికిచ్చిన వరం మేరకు తులసీవనంలో బాలికగా లభిస్తుంది మహాలక్ష్మి. భూదత్తయైన ఆ బిడ్డను 'గోదా' అన్న పేరుతో పెంచి పెద్ద చేస్తాడు విష్ణుభక్తుడైన విష్ణుచిత్తుడు. పూవుపుట్టగానే పరిమళిస్తుంది గదా! చిన్ననాటి నుండే శ్రీకృష్ణునికే తనువు, మనసు అంకితం చేసి ఆరాధిస్తూ పెరిగిన గోదా ప్రజలలో ఆధ్యాత్మిక చింతన, భక్తిభావన పెంపొందేలా ఆశువుగా ఎన్నో కవితలు చెప్పేది. హేమంత ఋతువులో ధనుర్మాసాన ఎంతో నియమనిష్టలతో ఆ స్వామిని భర్తగా పొందాలని తనను గోపికగా పూహించుకుంటూ నోములు నోచి చివరకు తన కోరిక సఫలం చేసుకుంటుంది. భోగి పర్వదినాన ఆ శ్రీరంగనాథుని వివాహం చేసుకుని ఆ స్వామిలో ఐక్యం పొందుతుంది. సంతానలక్ష్మిగా స్వామి చెంత నిలిచి స్త్రీలకు అనుకూల దాంపత్యాన్ని, సత్సంతానాన్ని అనుగ్రహిస్తుంది. ఆ చరితం మననం చేసుకుంటుంటే భక్తి పారవశ్యంతో మనసు పులకరించిపోతున్నది భరద్వాజ మహర్షి!" అన్నారు సూతముని.

"ధన్యులం మునీంద్రా! పుష్యమాసాన ధాన్యలక్ష్మి, సంతానలక్ష్ముల మహిమలను చాటి చెప్పే భోగి పర్వదినం గూర్చి తెలుసుకుని పునీతులమయ్యాం! మీకు సదా కృతజ్ఞులం" అన్నారు నైమిశారణ్యంలోని మునిబృందాలు ముక్తకంఠంతో.

"అయి కలి కల్మష నాశిని కామిని, వైదిక రూపిణి వేదమయే!

క్షీర సముద్భవ మంగళ రూపిణి, మంత్ర నివాసిని మంత్రనుతే!!

మంగళదాయిని అంబుజవాసిని, దేవగణాశ్రిత పాదయుతే!

జయ జయహే! మధుసూధన కామిని, ధాన్యలక్ష్మి సదా పాలయమాం!!"

"అయి ఖగవాహిని, మోహిని, చక్రిణి, రాగ వివర్ధిని జ్ఞానమయే!

గుణగణవారిధి లోకహితైషిణి స్వరసప్త విభూషిత గాననుతే!!

సకల సురాసుర దేవ మునీశ్వర మానవ వందిత పాదయుతే!

జయ జయహే! మధుసూధన కామిని సంతానలక్ష్మి సదా పాలయమాం!!" -

అంటూ అందరూ శ్రావ్యంగా చేస్తున్న స్తుతి గీతాలతో వాతావరణం భక్తి పులకాంకితమైంది.

☆